## 538 బాల ప్రార్థన

రా –ముఖారి తా–త్రిపుట

పిల్ల నైన నన్నుఁ జూడుమీ – ప్రియ మైన యేసు – పిల్ల నైన నన్నుఁ జూడుమీ = చల్లని రక్షకుఁడ వనుచు – సత్య వార్తఁ దెలుపుచుండ– నుల్ల మందు నిన్ను నమ్మి– కల్ల లేక వేఁడుకొందుఁ ॥బిల్ల నైన॥

1. నిన్ను నమ్మి యున్నవాఁడను – ఘన దేవ తనయ – నన్ను దాఁచు నీ నీడను = తిన్నని హృదయంబు నాకుఁ – జెన్నుగా నొసంగి యిపుడు – సన్నుతింప నిమ్ము – నన్ను – సాధు వైన నిన్నుఁ దలఁచి ॥పిల్లనైన॥
2. ప్రేమచేత నొప్పుచుంటివి – ప్రేమా స్వరూప – ప్రేమలోన నడచు చుంటివి = ప్రేమ లేని నన్నుఁ బ్రోవఁ – బ్రేమచేతఁ బ్రాణ మిచ్చి– ప్రేమఁ జూపు మనుచు నన్నుఁ బ్రీతి చేత బోధింపఁ ॥బిల్ల నైన॥
3. పరమ జనకు చిత్త మెప్పుడు–పరమేశ పుత్ర – బిరబిరగను జేయఁగా నిమ్ము= కరుణ మీర నాత్మచేత –వరవరంబు లొసఁగి నాకు – నరులలోన నిన్నుఁ గొలువ – ధరణిమీఁద నన్ను నిలుపఁ ॥బిల్లనైన॥
4. బలము మీర నన్ను నిలుపుము – తుల లేనివాఁడ – బలము గల్గు నీదు చేతుల = నిలను నీకు ఫలము లిచ్చి – యెలమి నిన్ను గొప్పఁ జేయ – సలలిత ముగ – నడువ నిమ్ము – చక్కని నీ మార్గమందుఁ ॥బిల్లనైన॥

– పులిపాక జగన్నాథము

## 539 ఉదయ ప్రార్థన

దేవ కావవే – నేడు మమ్ములన్ = నీవెరాత్రి కాచినావు – నీకు స్తోత్రము॥దేవ॥

1. ఆపదలు మమున్ – అంటకుండను = కావుమయ్య నేడు నీదు – కఱుణ తోడను ॥దేవ॥
2. నేటి కార్యముల్ – నేడె చేయగా = సూటియైన త్రోవ మాకు – చూపుమోప్రభో ॥దేవ॥
3. చెడ్డ కార్యముల్ – చేయకుండను = దొడ్డబుద్ధి నిచ్చి మమ్ము నుద్ధరించుము దేవ ॥దేవ॥



## 540 సాయంకాల ప్రార్థన

దేవకావవే – రాత్రి మమ్ములన్ = నీవె నేడు కాచినావు – నీకు స్తోత్రము॥దేవ॥

1. ఆపదలు మమున్ – అంటకుండను = కాపుగాచి మంచి నిద్ర – కలుగ జేయుమీ ॥దేవ॥
2. పండియుండగా – పాము తేలులున్ = గండములను తొలగజేసి – కాయుమో ప్రభో ॥దేవ॥
3. దుష్ట స్వప్నముల్ – దొంగ భయమును = కష్టములను తొలగజేసి – కాయుమో ప్రభో ॥దేవ॥

## 541 మంచి సమరయ్యుడు

రా –శంకరాభరణము(చాయ :వినరె మనుజులారా క్రీస్తు డిలనుజేయు) తా–ఆది

ఒక్క మనుజు – డెరుషలేమునుండి – యెరికొ పట్టణమునకు = ముక్కు వతో వెడలుచుండె – కొంత ధనముతో ॥ఒక్క॥

1. మార్గమందు – దొంగలతని – పట్టికొట్టి దోచుకొనిరి = మూర్ఛపోవు నట్లు గొట్టి – విడిచి వెళ్లిరి ॥ఒక్క॥
2. అపుడు నొక్క యాజకుండు – వచ్చి జూచి ప్రక్కగాను = కపటముతో వెళ్లె వాని నాదరింపక ॥ఒక్క॥
3. వెనుక నొక్క లేవియుండు – వచ్చి జూచి యోర్వలేక = గన్నులారా జూచి – పోయె గరుణలేకను ॥ఒక్క॥
4. పిదప సమరయుండు వచ్చి –బదిలముగను జూచి వాని – నాదరించె గరుణతోడ – భేదమెంచక ॥ఒక్క॥
5. నూనె ద్రాక్షరసము పోసి – గాయములను గట్టి వాని – ఘనమగు వాహనముమీద – నూరు చేర్చెను ॥ఒక్క॥
6. అటువలెను మనము కూడ – కష్టములలో నుండువారి = కష్టములను జూచి యాదరింపవలయును ॥ఒక్క॥

– జి.జాన్ తాతయ్య